గట్టు ధమాల్.. గుండె గుభేల్..

- ఏటిగట్టుకు రక్షణ కరవు
- ప్రమాదకరంగా మారిన బొరియలు
- జారిపోయిన మట్టి దిబ్బలు
- పటిష్టతకు కానరాని చర్యలు

సీతానగరం: అఖండ గోదావరి వరద నుంచి కాపాడే ఏటిగట్టుకు పెను ముప్పు పొంచి ఉంది. ఏటిగట్టు జారిపోయినా.. ప్రమాదకర బొరియలు ఏర్పడుతున్నా.. అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వచ్చేది వర్షాకాలం, ఆపై వరద ఉధృతి ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి.

దాదాపు పుష్కర కాలం క్రితం గోదావరి వరదతో ఏటిగట్టు జారి బలహీనంగా మారింది. సీతానగరం నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టుపై అనేక బొరియలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి వరదల సమయాల్లో ఏ ముప్పు ముంచుకొస్తుందోనన్న భయాందోళనలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు. మునికూడలి వద్ద ఏటిగట్టు జారిపోవడంతో



సీతానగరం ఏటిగట్టుపై ఏర్పడిన బొరియ

2012లో ఇరిగేషన్, అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ అధికారులు ధవళేశ్వరం నుంచి కూలీలతో ఇసుక బస్తాలను ఏటిగట్టు వెంబడి వేసి చేతులు దులుపుకొన్నారు. అదే సమయంలో సీతానగరంలోని లంకూరు వద్ద ఏటిగట్టు జారిపోవడంతో, అక్కడ కూడా ఇసుక బస్తాలు వేశారు. పన్నెండేళ్ల క్రితం వేసిన ఇసుక బస్తాలు మినహా ఏటిగట్టు పటిష్టతకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

30కి పైగా బొరియలు

సీతానగరం నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టు మధ్య 30కి పైగా బొరియలు ఏర్పడ్డాయి. పదకొండేళ్ల క్రితం జాలిమూడి వద్ద ఏటిగట్టుపై పడిన పెద్ద బొరియలో సుమారు 20 ఇసుక బస్తాలు వేసి వదిలేశారు. నాలుగేళ్ల క్రితం గోదావరి వరద సమయంలో బొబ్బిల్లంక శివారున ఏటిగట్టు జారిపోతే, ఇరిగేషన్ అధికారులు ఇసుక బస్తాలు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

భయాందోళనల్లో గ్రామాలు

గోదావరి వరదల సమయాల్లో ఏ ముప్పు ముంచుకొస్తుందోనని ఏటిగట్టు వెంబడి ఉన్న పురుషోత్తపట్నం, వంగలపూడి, రామచంద్రపురం, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో గోదావరి వైపున ఉన్న మట్టిని కొందరు వ్యాపారులు తవ్వి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏటిగట్టు జారిన ప్రాంతాల్లో గట్టును పటిష్టపర్చి, బొరియలను తక్షణమే పూడ్చడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గట్టును పటిష్టపర్చాలి



సీతానగరం నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టుపై పన్నెండేళ్ల క్రితం బొరియలు ఏర్పడ్డాయి. వాటిని అధికారులు ఇంత వరకు పూడ్చిన పాపాన పోలేదు. గోదావరి వరద ఉధృతంగా వస్తే ప్రమాదమే. సంబంధిత అధికారులు తక్షణమే బొరియలను పూడ్చి, ఏటిగట్టును పటిష్టపర్చాలి.

– తిర్నాతి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, వంగలపూడి

ఇలా ఉంటే ప్రమాదమే..



గోదావరి వరద ఉధృతంగా వస్తే ఏటిగట్టుకు ప్రమాదమే. సీతానగరం, మునికూడలి వద్ద ఏటిగట్టు జారిపోయి ఉంది. పన్నెండేళ్ల క్రితం ఇసుక బస్తాలు వేసి వదిలేశారు. నాలుగేళ్ల క్రితం బొబ్బిల్లంక శివారున ఇసుక బస్తాలు వేశారు. ఇప్పటి వరకు ఏటిగట్టును పటిష్టపర్చడానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

– అయిల శేషగిరి, కాంగ్రెస్ నాయకుడు, కూనవరం

చర్యలు తీసుకుంటాం..



గోదావరి వరదను దృష్టిలో ఉంచుకుని ఏటిగట్టుపై పడిన బొరియల్లో వేయడానికి ఇసుక బస్తాలు సిద్ధంగా ఉన్నాయి. బొరియల వలన ఎటువంటి ప్రమాదం లేదు. వీటిలో గ్రావెల్ వేయడానికి ఉన్నతాధికారులకు నివేదికను పంపించాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– శివ ప్రసాద్, ఏఈ, అఖండ గోదావరి లెఫ్ట్‌బ్యాంక్

క్లుప్తంగా

విజయ దుర్గాంబిక అమ్మవారికి పూజలు



రంగంపేటలో దుర్గాంబిక అమ్మవారు

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువైన శ్రీవిజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణశర్మ తెల్లవారు జామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దుర్గమ్మకు పంచామృతాభిషేకాలు



సంపరలో విజయదుర్గమ్మ

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గమ్మ వారికి శుక్రవారం సందర్భంగా పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

248 మందికి వైద్య సేవలు



రామచంద్రపురంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రామచంద్రపురంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 248 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు వైద్య సేవలందించారు. శుక్రవారం పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో డాక్టర్ రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇళ్ల వద్ద మంచంపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి, వైద్య సేవలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య పరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నం, ఏఎన్ఎం పద్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై చైతన్య ర్యాలీ



కుమారప్రియంలో డయేరియాపై వివరిస్తున్న సూపర్‌వైజర్ శ్రీగౌరీ తదితరులు

పెదపూడి: డయేరియా వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా ఉండాలని అంగన్‌వాడీ కేంద్రాల పెదపూడి సెక్టార్ సూపర్ వైజర్ శ్రీగౌరీ అన్నారు. కుమారప్రియం, కైకవోలు గ్రామాల్లో డయేరియా, అతిసార వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగౌరీ మాట్లాడుతూ డయేరియా, అతిసార నియంత్రణకు పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రజలు స్వచ్ఛమైన తాగునీరు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వాంతులు, విరేచనాలు, జ్వరాలు, జలుబు, దగ్గు వస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించాలన్నారు.

ఆటో స్టాండ్ ప్రారంభం



ఆటో స్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాజానగరం: ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మండలంలో తొలిసారిగా పర్యటించారు. లాలాచెరువు, స్పిన్నింగ్ మిల్లు కాలనీలోని పార్కు వద్ద కొత్తగా ఏర్పాటుచేసిన ఫ్రెండ్స్ ఆటో స్టాండ్‌ను శుక్రవారం ప్రారంభించారు. అలాగే నామవరంలో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పెట్టిన భోజన నాణ్యతను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

అక్రమాలను వెలికితీస్తా

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని, వాటన్నింటినీ ఆధారాలతో సహా వెలికితీస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన తోడ్పాటు నందిస్తానన్నారు. పలువురు నాయకులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మరింత పటిష్టంగా పారిశుధ్య పనులు



పెదపూడిలో జేసీబీ సహాయంతో పూడికల తొలగింపును పరిశీలిస్తున్న కార్యదర్శి శ్రీనివాసచౌదరి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్య పనులను మరింత మెరుగుపర్చాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. రామేశ్వరం, కరకుదురు, పెదపూడి తదితర గ్రామాల్లో రోడ్డు పక్కన చెత్త, మురుగు కాలువల్లో పూడికలను జేసీబీతో తొలగించారు. ఈ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రోడ్లపై ఉన్న చెత్త, మురుగు గుంటల్లో పూడికలు తొలగించి బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు. దోమల నివారణకు ఎబేట్ మందు పిచికారీ చేయాలని సిబ్బందికి సూచించారు. తాగునీటిని రోజూ క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని అన్నారు. వాతావరణంలో మార్పులు కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసచౌదరి, అచ్చిరాజు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం బాధితులకు భరోసా



అచ్యుతాపురంలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు తదితరులు

రంగంపేట: ఈలకొలను సచివాలయం పరిధి అచ్యుతాపురం గ్రామంలో డయేరియా బాధితులను జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు తదితరులు శుక్రవారం పరామర్శించారు. డయేరియా కారణంగా గ్రామంలో ఎనిమిది మంది వాంతులు, విరేచనాలతో మంచం పట్టారు. రంగంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి సేవలు అందిస్తున్నారు. దీంతో బాధితులు కోలుకుంటున్నారు. ఈ సందర్భంగా వారందరినీ ఇంటింటికీ వెళ్లి ప్రజాప్రతినిధులు పరామర్శించారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వైద్య శిబిరాన్ని సందర్శించి ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాధితులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండండి



పశ్చిమ గానుగూడెంలో లోతట్టు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న వైద్యారోగ్య శాఖ బృందం

మధురపూడి: ప్రాణాంతకమైన డయేరియా, డెంగీ ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్ ప్రగ్న అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం పశ్చిమ గానుగూడెంలోని లోతట్టు, ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులకు అవగాహన కల్పించారు. మంచినీటి ట్యాంకులు, నీటి సరఫరా జరిగే ప్రదేశాలు శుభ్రంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పశువులుండే, కోళ్ల ఫారాలుండే ప్రదేశాలు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా దోమ తెరలు వాడాలన్నారు. వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే డయేరియా, డెంగీ, టైఫాయిడ్ రోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు. విరేచనాలు ఉంటే ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్యారోగ్య శాఖ ద్వారా ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తారన్నారు.

మార్పు.. పంట మంచికే..

- సాగులో వైవిధ్యంతో ప్రయోజనాలు
- మంచి దిగుబడులకు మార్గం



రంగంపేటలో సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

రంగంపేట: కొత్తగా ఆలోచిస్తే 'కాసుల పంటే'.. పంట మార్పిడితో సిరులు ముంగిటే.. సాగులో సస్య రక్షణకు తోడు అధికారుల సలహాలు పాటిస్తే మంచి దిగుబడులు రైతుల వెంటే.. అందుకే ప్రస్తుత కాలంలో పంట మార్పిడి విధానానికి పుడమి పుత్రులు అధిక ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారు. అనపర్తి నియోజకవర్గంలో ఖరీఫ్ సాగుకు అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు. అనపర్తి మండలంలో 12,650 ఎకరాలు, బిక్కవోలు మండలంలో 17,500, రంగంపేట మండలంలో 22,400, పెదపూడి మండలంలో 18,500 ఎకరాల్లో పంటల సాగు చేస్తున్నారు. వేసిన పంటే ప్రతిసారీ వేయడం వల్ల దిగుబడులు తగ్గడంతో పాటు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అలాగే అందరూ ఒకే పంట సాగు చేస్తే గిట్టుబాటు ధర కూడా రాదు. అలా కాకుండా ఏటా పంట మార్పిడి విధానం పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకే రకం కాకుండా వివిధ రకాల పంటలను క్రమ పద్ధతిలో సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చంటున్నారు. పంట మార్పిడితో భూసారం కూడా పెరుగుతుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు పంట మార్పిడి విధానంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అందుకే నష్టాలు

ఏటా ఒకే రకం పంట వేయడంతో పొలాల్లో చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా సమృద్ధిగా పెరగదు. దిగుబడులూ తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతోంది. వేరు వ్యవస్థ ఒకే లోతులో ఉండడం వల్ల నేలలో ఆ లోతు వరకూ ఉన్న పోషకాలకు మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి. పండిన పంట ఉత్పత్తుల్లో నాణ్యత లోపిస్తుంది. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంటుంది. ఒకే పంట అంతా వేయడంతో మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి.

అపరాల సాగు అవసరం

వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు వేయడం వల్ల భూసారం పెరుగుతోంది. సేంద్రియ ఎరువు భూమిలో పెరుగుతుంది. అపరాల సాగుతో తెగుళ్ల బెడద తగ్గుతుంది. వరి తరువాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటివి సాగు చేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తరువాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తుంది.

మంచి దిగుబడులు



ఒకే రకం పంట సాగు చేయడం మంచిది కాదు. పంట మార్పిడి విధానం పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం చాలా మంది రైతులు తమ పొలాల్లో ఒకే రకం పంటను తరచూ వేస్తున్నారు. నీటి పారుదల ఉన్నచోట వరి తప్ప ఇతర పంటలు వేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీనిని అధిగమించేందుకు పంట మార్పిడి విధానం ఉత్తమం.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఉండేశ్వరపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురంలో సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు, ఫ్రైడే–డ్రై డే కార్యక్రమంలో భాగంగా వైద్యారోగ్య సిబ్బంది ఈ ర్యాలీ చేశారు. మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, డెంగీ, పచ్చ కామెర్లు, చికున్‌గున్యా తదితర వ్యాధులు రాకుండా, ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సురక్షిత, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, నిల్వ ఆహారాన్ని తినరాదని, ఆహార పాత్రలపై మూతలు ఉంచాలని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి విఠల్, హెల్త్ వెల్నెస్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ ఎస్‌కే మౌనిక, ఏఎన్ఎం ఎం.పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థలం చూపిస్తే ఆసుపత్రి నిర్మిస్తాం..



కొమరిపాలెంలో ఏపీఎస్ఎంఐడీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: ఆస్పత్రి నిర్మాణానికి తగిన స్థలం సమకూరిస్తే వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కొమరిపాలెంలో శుక్రవారం ఆయన ఏపీఎస్ఎంఐడీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనపర్తిలో 100 పడకల ఆసుపత్రి నిమిత్తం రూ. 13 కోట్లు మంజూరు చేశారని, కానీ 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి మూడెకరాల స్థలం అవసరమన్నారు. అప్పట్లో ఇక్కడున్న 1.8 ఎకరాల స్థలం, పక్కన ఉన్న కళావేదిక చూపించి ఆసుపత్రి మంజూరు చేశారన్నారు. 1.8 ఎకరాలతో మిగతా 1.2 ఎకరాల స్థలం ఏర్పాటు చేస్తే వెంటనే ఆసుపత్రి నిర్మాణం చేపడతామని తెలిపారు. ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు

రంగంపేట: డయేరియా ప్రబలకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అచ్యుతాపురంలో డయేరియా బాధితులను శుక్రవారం రాత్రి ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల్లో అచ్యుతాపురంలో ఎనిమిది డయేరియా కేసులు బయట పడ్డాయన్నారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది అప్రమత్తమై వైద్య సేవలు అందించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు.

మార్కెట్‌కూ మూఢం

- పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు బ్రేక్
- బంగారం, వస్త్ర, ఇతర వ్యాపారాలపై తీవ్ర ప్రభావం
- దాదాపు 40 శాతం తగ్గిన అమ్మకాలు



కొనుగోలుదారులు తగ్గడంతో వెలవెలబోతున్న మెయిన్ రోడ్డు

ప్రకాశం నగర్: వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులు తగ్గడంతో వెలవెలబోతున్నాయి. హిందూ సంప్రదాయం ప్రకారం మూఢమిగా పరిగణించే గురు, శుక్ర మూఢముల కారణంగా పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు ముహూర్తాలు లేవు. ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి ప్రారంభమైన గురు, శుక్ర మూఢములు ఆగస్టు 8 వరకూ ఉండడంతో పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి శుభ కార్యక్రమాలు లేవు. ఈ నేపథ్యంలో ఆయా కార్యక్రమాలకు అవసరమైన దుస్తులు, బంగారం, ఇతర పూజా సామగ్రి, పువ్వుల దుకాణాలు, కిరాణా, ఫ్యాన్సీ వస్తువులు వంటి వాటి అమ్మకాలు తగ్గాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. నగరంలోని ప్రధాన మార్కెట్‌లైన మెయిన్ రోడ్డు, కోటగుమ్మం సెంటర్, గుండువారి వీధి, టౌన్ హాలు రోడ్లతో పాటు, తాడితోట మహాత్మాగాంధీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, చందన మార్కెట్ వంటి ప్రధాన మార్కెట్లు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు లేక ఆయా షాపులు వెలవెలబోతున్నాయి.

ఉపాధిపై తీవ్ర ప్రభావం

శుభ కార్యాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధారపడి ఉన్న కేటరింగ్ చేసే వంట మనుషులు, సప్లయి కంపెనీ, లైటింగ్, డెకరేషన్ కార్మికులు, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లలో పనిచేసే కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా చిరు వస్త్ర వ్యాపారులు, ఫుట్‌పాత్ వర్తకులు అమ్మకాల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా, కార్పొరేట్ వ్యాపార సంస్థల్లో సైతం ఆశించిన స్థాయిలో విక్రయాలు లేవు. ఈ నేపథ్యంలో వారి విక్రయాలను పెంచుకునేందుకు ఆయా సంస్థలు కొనుగోలుదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నారు.

ఆగస్టు వరకూ అంతంత మాత్రమే..

ఈ ఏడాది జూన్‌లో మూఢమి, జూలైలో ఆషాఢ మాసాలు ఉండడంతో ఆగస్టులో శ్రావణ మాసం వచ్చే వరకు ఈ సీజన్‌లో వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉంటాయని వర్తక ప్రతినిధులు చెబుతున్నారు. సామాన్యంగా సీజన్‌తో పోలిస్తే, 40 శాతం అమ్మకాలు తగ్గిపోవడంతో ఈ రెండు మాసాలు షాపు అద్దె, కరెంట్ బిల్లులు, కార్మికుల జీతాలు, రోజు వారీ ఖర్చులు వంటివి అదనపు భారంగా మారుతాయంటున్నారు. మరలా పెళ్లిళ్ల సీజన్ వస్తే వ్యాపారాలు పుంజుకుంటాయని వర్తక వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ఆశించిన స్థాయిలో లేవు



సీజన్‌తో పోలిస్తే ఈ రెండు మాసాల్లో వ్యాపారాలు ఆశించిన స్థాయిలో ఉండవు. ముఖ్యంగా వస్త్ర వ్యాపార రంగంలోకి కార్పొరేట్ సంస్థలు రావడంతో, సామాన్యులు సైతం షాపింగ్ మాల్స్‌లో వస్త్రాలు కొనుగోలు చేస్తున్నారు. యువత ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌ల్లో వస్త్రాల కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో చిన్న, మధ్య తరహా వ్యాపారాలు మూతపడే పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఎం.సత్యనారాయణ (వస్త్ర వ్యాపారి)

ముగిసిన నాక్ బృందం పర్యటన



నాక్ బృందంతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గ్రేడ్ కేటాయించడానికి వచ్చిన నాక్ బృందం రెండు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రామన్ రంగరాజన్, కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ వైహెచ్ నాయక్ వడి, మెంబర్ డాక్టర్ అంజన్‌కుమార్ నాయుడు ఆఫీస్ పనితీరు, ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు, కళాశాల భౌతికమైన వాతావరణాన్ని పరిశీలించారు. అనంతరం ఎగ్జిట్ మీటింగ్ నిర్వహించి, కళాశాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, అధ్యాపకులకు నాక్ బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, షేక్ మదీనా, సుబ్బారావు, డాక్టర్ మాధవ్, డాక్టర్ ఎం సుధామయి, వాణి, మీనాక్షి, అలేఖ్య, వెంకటేష్, సురేంద్ర, లైబ్రేరియన్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.